సూర్య www.suryaa.com
19వ వసంతంలోకి..
www.suryaaepaper.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
05-03-2026
పేజీలు: 02

# పేద విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్య, రైతులకు రుణమాఫీ



తమిళనాడు శాసనసభ ఎన్నికలకు మరో వారం పది రోజుల్లో షెడ్యూల్ వెలువడనుండగా.. డీఎంకే, అన్నాడీఎం, బీజేపీ సహా రాజకీయ పార్టీలు ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. తొలిసారి బరిలోకి దిగుతున్న ఇళయ దళపతి, టీవీకే అదినేత విజయ్ బుధవారం తన ఎన్నికల మేనిఫెస్టోలోని కీలక హామీలను వెల్లడించారు. తాము అధికారంలోకి వస్తే పేద కుటుంబాలు, చిన్న, సన్నకారు రైతుల పిల్లలకు ఉచితంగా ఉన్నత విద్య, ఐదు ఎకరాలలోపు రైతులకు వ్యవసాయ రుణాల మాఫీ, అవినీతి అంతానికి కఠిన చర్యలు తీసుకుంటానమి హామీ ఇచ్చారు. తంజావూర్‌లో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన తమిళ వెట్రి కళగం (టీవీకే) అధినేత.. రాబోయే ఎన్నికలు తనకు, తన మద్దతుదారులకు తీవ్ర భావోద్వేగంతో కూడుకున్నవని, ప్రభుత్వ ఏర్పాటుకు తమకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. రెండు ఎకరాలలోపు భూమి ఉండే రైతు కుటుంబాలకు చెందిన పిల్లల ఉన్నత విద్యకు అయ్యే ఖర్చును పూర్తిగా భరిస్తామని అన్నారు. పెరుగుతున్న విద్యా ఖర్చులతో ఇబ్బంది పడుతున్న ఆర్థికంగా బలహీనమైన గ్రామీణ కుటుంబాలకు మద్దతు ఇవ్వడం ఈ హామీ లక్ష్యం. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామనే విజయ్ హామీ తమిళ రాజకీయాల్లో తన పార్టీని స్వచ్ఛతకు ప్రత్యామ్నాయంగా చెప్పకునే ప్రయత్నంగా భావించవచ్చు. రాబోయేది తమ ప్రభుత్వమేనని, మత్స్యకారులకు రక్షణ కల్పిస్తానని విజయ్ హామీ ఇచ్చారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు సహకార పంట రుణాలను మాఫీ చేస్తామని విజయ్ హామీ ఇచ్చారు. రెండు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు, భూమిలేని కార్మికుల పిల్లల విద్యా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో అధికార డీఎంకేను దుష్ట శక్తితో పోల్చుతూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే, అన్నాడీఎంకేలు తనను అధికారంలోకి రాకుండా అడ్డుకోడానికి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆ రెండు పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని దుయ్యబట్టారు. విజయ్ తన ఎన్నికల మేనిఫెస్టో ప్రకటనకు తంజావూర్‌ను ఎంచుకోడానికి కారణం ఉన్నత విద్యా శాఖ మంత్రి గోవి చెంజియన్ ఈ జిల్లాకు చెందినవారే కావడం.

## 'వృషకర్మ' గ్లింప్స్ రిలీజ్

నాగ చైతన్య, మీనాక్షి చౌదరి జంటగా తెరకెక్కుతున్న సినిమా వృషకర్మ. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై BVSN ప్రసాద్, సుకుమార్ నిర్మాణంలో కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా అనౌన్స్ నుంచే మంచి హైప్ నెలకొంది. తాజాగా వృషకర్మ సినిమా గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ తోనే కాస్త భయపెట్టారు. ఇది హారర్ థ్రిల్లర్, సోషియో ఫాంటసీ జానర్లో ఉండబోతుందని తెలుస్తుంది. గ్లింప్స్ తోనే నాగచైతన్య హిట్ కొట్టేస్తాడు అని ఫిక్స్ అయిపోతున్నారు.

## చైనా, రష్యాల టెక్నాలజీ?

### నిషేధిత క్లస్టర్ బాంబ్ క్షిపణులతో ఇరాన్ దాడి



తమ భూభాగంపైకి క్లస్టర్ బాంబు బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ ప్రయోగించిందని ఇజ్రాయెల్ సైనిక అధికారులు తెలిపారు. ప్రస్తుతం యుద్ధంలో ఇటువంటి వివాదాస్పద అత్యాధునిక బాంబులను వినియోగించడం ఇదే మొదటిసారి. ఆధునిక ఆయుధాల్లో అత్యంత వివాదాస్పదమైన వాటిలో క్లస్టర్ క్షిపణులు ఒకటి. డజన్ల కొద్దీ పేలుడు పదార్థాలను విస్తారమైన ప్రాంతంలో ఒకేసారి వెదజల్లగలిగే సామర్థ్యం వీటి సొంతం. ఇరాన్‌కు చెందిన క్లస్టర్ క్షిపణి వార్‌హెడ్‌లు.. గాల్లోనే 80 వరకు సబ్‌మ్యూనిషన్‌లను విడుదల చేయగలవని, అనేక కిలోమీటర్ల దూరంలో విధ్వంసకర శకలాలను వ్యాపింపజేయగలవని ఇజ్రాయెల్ రక్షణ అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా ఈ తరహా క్షిపణులపై నిషేధం ఉన్నా.. ఇరాన్ ఎలా వీటిని పొందిందనేది చర్చనీయాంశంగా మారింది.


**నిపుణుల హెచ్చరిక**

ఈ ఆయుధాల వినియోగంతో యుద్ధ స్వరూపమే మారిపోతుందని సైనిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకేచోట భారీ పేలుడు సంభవించకుండా.. అనేక ప్రాంతాల్లో చిన్న చిన్న బాంబులను చెల్లాచెదురుగా వార్‌హెడ్‌లు వెదజల్లుతాయి. దీంతో పౌరుల ప్రాణాలకు ముప్పు గణనీయంగా పెరుగుతుంది. అంతేకాదు, పేలకుండా మిగిలిపోయిన బాంబులతో యుద్ధం ముగిసిన తర్వాత కూడా దీర్ఘకాలం ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది తక్షణ సైనిక ముప్పు మాత్రమే కాదు.. ఈ బాంబులను తయారుచేసే సామర్థ్యాన్ని ఇరాక్ ఎలా అభివృద్ధి చేసుకుందనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అత్యాధునిక అయుధ తయారీ కోసం పరిశోధనలు సాగించే శాస్త్రవేత్తలు తరుచూ లక్ష్యంగా మారిన ఆ దేశంలో ఇంతటి అధునాతన సాంకేతికత ఎలా వచ్చిందనేది ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ బాంబులు తయారీకి బయట నుంచి సహకారం ముఖ్యంగా చైనా, రష్యాల నుంచి సాంకేతి పరిజ్ఞానం బదిలీ జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇజ్రాయెల్‌పై దాడులు**

తాజా దాడుల్లో కనీసం ఓ ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి క్లస్టర్ బాంబులను మోసుకొచ్చిందని, అది సెంట్రల్ ఇజ్రాయెల్‌లో కూలిందని ఆ దేశ సైనికాధికారులు తెలిపారు. ఇజ్రాయెల్ నివేదికల ప్రకారం.. క్షిపణి వార్‌హెడ్ భూమి నుంచి దాదాపు నాలుగు మైళ్ల ఎత్తులో లేదా దాదాపు ఏడు కిలోమీటర్ల ఎత్తులో విడిపోయింది. ఆ తర్వాత అది దాదాపు 20 సబ్‌మ్యూనిషన్‌లను విడుదల చేసి, మధ్య ఇజ్రాయెల్ మీదుగా దాదాపు ఐదు మైళ్ల వ్యాసార్థంలో వాటిని జారవిడిచింది. గత నెల 28 నుంచి జరుగుతోన్న యుద్ధంలో ఇప్పటి వరకూ ఇజ్రాయెల్‌లో 11 మంది ప్రాణాలు కోల్పోయారని, 1000 మందికిపైగా గాయపడ్డారు. తక్కువ ఫ్రీక్వెన్సీ ఉన్నప్పటికీ, క్లస్టర్ వార్‌హెడ్‌ల వినియోగం కొత్త సవాల్ విసురుతుందని ఇజ్రాయెల్ రక్షణ అధికారులు పేర్కొన్నారు. ఈ ఆయుధాలు పట్టణ ప్రాంతాలలో డజన్ల కొద్దీ బాంబులను వెదజల్లి, మరింత క్లిష్టతరం చేస్తాయని, ద్వితీయ ప్రమాదాలను పెంచుతాయని తెలిపారు. గత శనివారం నుంచి ఇరాన్ ఇజ్రాయెల్‌పై కనీసం ఐదు క్లస్టర్ క్షిపణులను ప్రయోగించిందని, అన్నీ జనసాంద్రత కలిగిన పౌర ప్రాంతాలే లక్ష్యంగా ఉన్నాయని రక్షణ అధికారులు భావిస్తున్నారు. మంగళవారం మధ్య ఇజ్రాయెల్ వైపు జరిగిన దాడిలో అలాంటి రెండు క్షిపణులను ప్రయోగించారు. ఈ దాడులు అనేక ప్రదేశాలలో ఆస్తి నష్టం, గాయాలకు కారణమయ్యాయి. గతేడాది జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన యుద్ధ సమయంలో ఇరాన్ మొదటిసారిగా ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. ప్రస్తుత యుద్ధంలోనూ వాటిని మళ్లీ వాడుతోందని పేర్కొన్నారు. వీటిలో స్వల్పశ్రేణి జోల్ఫాఘర్, దీర్ఘశ్రేణి ఖద్ర్ సిరీస్, ఖోర్రామ్‌షహర్ బాలిస్టిక్ క్షిపణులు ఉన్నాయని చెప్పారు. ఈ మూడు వ్యవస్థలలో ఖోర్రామ్‌షహర్ అత్యంత శక్తివంతమైందిగా పరిగణిస్తారు. దాదాపు 2,000 కిమీ పరిధిని కలిగిన ఈ క్షిపణి, 80 బాంబులను మోయగలదని ఇరాన్ పేర్కొంది.

## బాబర్‌పై వేటు



పొట్టి ప్రపంచకప్‌లో దారుణంగా విఫలమైన పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌పై వేటు పడింది. ఈ నెల 11 నుంచి బంగ్లాదేశ్‌తో జరుగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తాజాగా ఎంపికచేసిన 15 మంది జట్టు సభ్యులలో అతడికి చోటు దక్కలేదు. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలతో ఈ సిరీస్‌పై అనిశ్చితి కొనసాగుతున్న వేళ.. పీసీబీ తాజాగా జట్టును ప్రకటించడం గమనార్హం. సూపర్-8 దశలోనే నిష్క్రమించి ఇంటా బయటా తీవ్ర విమర్శలెదుర్కొంటున్న ఆ జట్టులో పీసీబీ భారీ ప్రక్షాళన చేసింది. ఏకంగా ఆరుగురు అన్‌క్యాప్డ్ ఆటగాళ్లకు జట్టులో చోటు కల్పించింది. షహీన్ షా అఫ్రిది సారథ్యం వహించనున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో చోటు కోల్పోయిన పేసర్ హరీస్ రౌఫ్‌తో పాటు బ్యాటర్ హుస్సేన్ తలాత్ వచ్చే జట్టులోకి వచ్చారు. ఈనెల 11, 13, 15 తేదీల్లో ఢాకా వేదికగా మూడు వన్డేలు జరుగుతాయి.



## జిమ్‌లో వ్యాయామం చేస్తూ హార్ట్ ఎటాక్‌తో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


జిమ్‌లో వ్యాయామం చేస్తూ హార్ట్ ఎటాక్‌తో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి.హైదరాబాద్-జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లో విషాదం.రోజూలాగే వ్యాయామం కోసం బుధవారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లో ఉన్న ఏసిబో జిమ్‌కి వచ్చిన నాగండ్ల అనిల్ చౌదరి(36).కాసేపు వ్యాయామం తర్వాత వాష్‌రూమ్‌కి వెళ్లి అక్కడే స్పృహతప్పి కుప్పకూలి పడిపోయిన అనిల్ చౌదరి.వెంటనే CPR చేసినప్పటికీ లాభం లేకపోవడంతో హుటాహుటిన స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు . కానీ, అప్పటికే అనిల్ హార్ట్ ఎటాక్‌తో మృతి చెందాడని నిర్ధారించిన డాక్టర్లు.

## ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ యూజర్లకు .. ఇక 4జీ కూడా అన్‌లిమిటెడ్





ప్రముఖ టెలికాం కంపెనీ భారతీ ఎయిర్ టెల్ పోస్ట్ పెయిడ్ కస్టమర్లకు శుభవార్త చెప్పింది. ప్రస్తుతం అందిస్తున్న అన్‌లిమిటెడ్ 5జీతో పాటు 4జీ డేటా సర్వీసులను సైతం అన్‌లిమిటెడ్‌గా అందిస్తామని తెలిపింది. ఈ మేరకు వ్యక్తిగత, ఫ్యామిలీ పోస్ట్ పెయిడ్ ప్లాన్లను అప్‌డేట్ చేసినట్లు తెలిపింది. దీనిపై అధికారికంగా కంపెనీ ప్రకటన చేయనప్పటికీ వెబ్‌సైట్లో ఆ మేరకు మార్పులు చేసింది. మొదట 10 సర్కిళ్లలో ప్రయోగాత్మకంగా అన్‌లిమిటెడ్ సర్వీసులు ప్రారంభించిన ఎయిర్ టెల్ దేశవ్యాప్తంగా అన్ని సర్కిళ్లలో ఈ సేవలను తీసుకొచ్చినట్లు తెలిపింది. అన్‌లిమిటెడ్ అంటే 300 జీబీ వరకు హైస్పీడ్ డేటాను యూజర్లు పొందవచ్చని తెలిపింది. అప్‌డేట్ చేసిన ప్లాన్ల ప్రకారం నెలకు రూ.449 వ్యక్తిగత ప్లాన్ ద్వారా 1 సిమ్ (ప్రైమరీ), అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్, అన్‌లిమిటెడ్ 4జీ, 4జీ డేటా (300 జీబీ వరకు), ఎయిర్ టెల్ ఎక్స్ ట్రీమ్ ప్లై, జియో హాట్ స్టార్ (3 నెలలు) వంటివి వస్తాయి. ఇక రూ.549 ప్లాన్ ద్వారా 1 సిమ్, అన్‌లిమిటెడ్ కాల్స్ ప్లస్ ఎస్ఎంఎస్, డేటాతో పాటు అదనంగా డిస్నీ ప్లస్ హాట్ స్టార్ 12 నెలలు, అమెజాన్ ప్రైమ్ 6 నెలలు వంటి ఓటీటీ బెనిఫిట్స్ సైతం వస్తాయి.

## గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్



గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ కార్యాలయాల్లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పిస్తామని ప్రకటించింది. అదే సమయంలో, గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను 'స్వర్ణ గ్రామం', 'స్వర్ణ వార్డు' కార్యాలయాలుగా మారుస్తూ శాసన మండలిలో ప్రవేశపెట్టిన బిల్లుకు ఆమోదం లభించింది. బుధవారం శాసన మండలిలో ఈ బిల్లు ఆమోదం సందర్భంగా రాష్ట్ర స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడారు. ఈ కొత్త కార్యాలయాల ద్వారా 'స్వర్ణాంధ్ర' సాధనకు కృషి చేస్తామని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యాలయాల పర్యవేక్షణ కోసం మూడంచెల వ్యవస్థను తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఈ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండేదని, కూటమి ప్రభుత్వంలో దానిని పటిష్ఠం చేస్తున్నామని మంత్రి వివరించారు.



## మనోజ్ సినిమాలో మెరవనున్న రాశి

టాలీవుడ్ యాక్షన్ స్టార్ మంచు మనోజ్ తన తాజా చిత్రం 'డేవిడ్ రెడ్డి'తో వెండితెరపై ఒక భారీ పీరియాడిక్ విజువల్ వండర్‌ను ఆవిష్కరించబోతున్నారు. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ ఫిల్మ్ నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాలో మాస్ ఆడియన్స్‌ను ఉర్రూతలూగించే ఒక స్పెషల్ సాంగ్‌ను ప్లాన్ చేశారట. ఇందులో మనోజ్‌తో కలిసి స్టెప్పులు వేయడానికి గ్లామరస్ బ్యూటీ రాశి ఖన్నాను ఎంపిక చేసినట్లు సమాచారం. సీరియస్ కథాంశంతో సాగే ఈ సినిమాలో రాశి ఖన్నా చేసే ఈ ఐటెం సాంగ్ ఒక ఊపు ఊపుతుందని చిత్ర బృందం భావిస్తోంది. ఇక ఈ సినిమా కథా నేపథ్యం విషయానికొస్తే.. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ పాలకుల గుండెల్లో నిద్రపోయిన 'డేవిడ్ రెడ్డి' అనే వీర యోధుడి పోరాట గాథ ఇది.

# ఆ 40 కులాలను ఓబీసీల్లో చేర్చండి....
# కేంద్రానికి తెలంగాణ బీసీ కమిషన్ విజ్ఞప్తి



తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన బీసీ కులాలను కేంద్ర ప్రభుత్వం కూడా ఓబీసీ జాబితాలో చేర్చాలని.. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ విజ్ఞప్తి చేస్తోంది. తెలంగాణలో మొత్తం 130 కులాలను రాష్ట్ర ప్రభుత్వం బీసీలుగా గుర్తించింది. అయితే అందులో 90 కులాలు మాత్రమే కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఓబీసీ కేటగిరీలో ఉన్నాయి. మిగిలిన 40 కులాలు మాత్రం ఓబీసీ కేటగిరీలో లేకపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. త్వరలోనే దేశంలో జనగణన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా.. త్వరలోనే ప్రక్రియను మొదలుపెట్టేందుకు రాష్ట్రాలు కూడా జిల్లా యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే జనగణన ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే ఆ 40 కులాలను కూడా ఓబీసీల్లో విలీనం చేయాలని తెలంగాణ కోరుతోంది. రాష్ట్రంలో ఉన్న మరో 40 బీసీ కులాలను తక్షణమే కేంద్ర ఓబీసీ (OBC) జాబితాలో చేర్చాలని రాష్ట్ర బీసీ కమిషన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. త్వరలో జరగబోయే జనాభా గణన కంటే ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసింది. వచ్చే జనాభా గణనలో భాగంగా తెలంగాణలో ఇళ్ల జాబితా సేకరణ పనులు 2026 మే 11 నుంచి జూన్ 9 వరకు జరుగుతాయి. ఆ తర్వాత అసలైన జనాభా లెక్కింపు 2027 ఫిబ్రవరి 9 నుంచి ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుంది. ఈ లోపే కులాల మార్పులు జరగాలని కమిషన్ కోరుతోంది. ప్రస్తుతం 130 కులాలను తెలంగాణ ప్రభుత్వం బీసీలుగా గుర్తించింది. ఈ 130 కులాలకు రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అందించే అన్ని పథకాలు అమలు అవుతున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వ ఓబీసీ జాబితాలో మాత్రం తెలంగాణ నుంచి కేవలం 90 కులాలు మాత్రమే ఉండటం గమనార్హం. మిగిలిన 40 కులాల పేర్లు కేంద్ర ఓబీసీ జాబితాలో లేకపోవడంతో.. ఆ కులాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ బీసీ కమిషన్ తాజాగా సిఫారసులు చేసింది. జనగణనలో ఈ 40 కులాల వారు ఓబీసీలుగా నమోదు చేయకపోతే.. తెలంగాణలో బీసీల సంఖ్య వాస్తవంగా ఉన్న దాని కంటే తక్కువగా నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి బీసీలకు అందాల్సిన నిధులు, ప్రయోజనాలు, పథకాలు అందకుండా పోయే అవకాశాలు ఉన్నాయనే ఆవేదన వ్యక్తం అవుతోంది. అయితే దీనిపై ఇప్పటికే తెలంగాణ సర్కార్, బీసీ కమిషన్ చాలా సార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా.. ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే త్వరలోనే జనగణన మొదలు కాకముందే ఆ 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుకు లేఖ రాశారు. నిబంధనల ప్రకారం ఒక కులాన్ని కేంద్ర ప్రభుత్వ జాబితాలోకి చేర్చాలంటే రాష్ట్ర కమిషన్ సిఫార్సు ఉండాలి. ఆ సిఫార్సులకు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సీబీసీ) ఆమోదం కల్పించాలి. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి అయిన తర్వాతే ఆ కులాల విద్యార్థులకు విద్యా, ఉద్యోగాల పరంగా రిజర్వేషన్లు లభిస్తాయి.



## రాజ్యసభకు వేం నరేందర్‌రెడ్డి!

రాజ్యసభ సీటును ఆశించిన పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలకు నిరాశ తప్పలేదు. వారిని పక్కనపెట్టి వలస కాంగ్రెస్ నేత, సీఎం రేవంత్ సన్నిహితుడు, సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి రాజ్యసభ సీటు ఖరారైంది. ఢిల్లీ అధిష్ఠానం ఆయన అభ్యర్థిత్వానికి ఆమోదముద్ర వేసింది. ఇందుకు సంబంధించి గురువారం అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నది. రాజ్యసభ సీటు కోసం పలువురు సీనియర్ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేశారు. జీవన్‌రెడ్డి, వీ హనుమంతరావు, చిన్నారెడ్డి, కోదండరెడ్డి, మధుయాష్కీగౌడ్, జగ్గారెడ్డితోపాటు పలువురు నేతలు ప్రయత్నించారు. అయితే, సీనియర్లకు దక్కకుండా ముఖ్యనేత పావులు కదిపారనే ప్రచారం జరిగింది. సీనియర్ నేతలకు రాజ్యసభ సీటు దక్కితే, తన పట్టు సడిలిపోతుందని భావించిన ముఖ్యనేత.. తన అనుయాయుల నే బరిలో నిలపాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. తనకు ఆత్మబంధువుగా పేరున్న వేం నరేందర్‌రెడ్డి పేరును తెరపైకి తీసుకొచ్చారు. ఢిల్లీలో భారీ లాబీయింగ్ చేసి తన ఆత్మబంధువుకు రాజ్యసభ సీటు వచ్చేలా చేశారనే చర్చ జరుగుతున్నది. దీంతో సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కష్టపడ్డ తమలాంటి వారికి అవకాశం ఇవ్వకుండా రాజకీయాలకు, లాబీయింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చారంటూ రగిలిపోతున్నారు.

### ఖాట్మండులో ఓటేసిన నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీల కర్కి



నేపాల్‌లో సాధారణ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ జరుగుతోంది. సాధారణ ప్రజలతోపాటు రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. నేపాల్ తాత్కాలిక ప్రధానిగా పనిచేస్తున్న సుశీల కర్కి ఓటు వేశారు. ఖాట్మండులోని ధాపసి పోలింగ్ కేంద్రంలో ఆమె తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సుశీల కర్కి ఓటు వేస్తున్న దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.


### మమ్మల్ని రక్షించండి.. ప్రధాని మోదీ, సీఎంలకు
## బహ్రెయిన్‌లోని తెలుగువారి విజ్ఞప్తి

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా తెలంగాణ, ఏపీకి చెందిన పలువురు పర్యాటకులు బహ్రెయిన్‌లో చిక్కుకుపోయారు. తమను వెంటనే సురక్షితంగా స్వదేశానికి తరలించాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. హైదరాబాద్‌కు చెందిన సల్మాన్ రాజ్ అనే వ్యక్తి, తమ బృందం పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. వివరాల్లోకి వెళితే.. ఫిబ్రవరి 24న తెలుగు రాష్ట్రాలకు చెందిన పర్యాటకుల బృందం టూరిస్ట్ వీసాపై బహ్రెయిన్ వెళ్లింది. నాలుగు రోజుల పర్యటన ముగించుకుని తిరిగి హైదరాబాద్ రావాల్సి ఉండగా, పశ్చిమాసియా లో అకస్మాత్తుగా యుద్ధ వాతావరణం నెలకొంది.



ఈ పరిణామాలతో విమానాశ్రయాలు మూత పడటం, విమాన సర్వీసులు రద్దు కావడంతో వారి ప్రయాణానికి ఆటంకం ఏర్పడింది. ఈ సందర్భంగా సల్మాన్ రాజ్ వీడియోలో మాట్లాడుతూ... "మేము భారత ప్రభుత్వంతో పాటు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల సహాయం కోరుతున్నాం. టూరిస్ట్ వీసాపై ఇక్కడికి వచ్చాం. తిరిగి వెళ్లేందుకు ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లగా, అక్కడ బాంబులు, క్షిపణుల దాడులు జరుగు తున్నాయి. చెక్-ఇన్ కౌంటర్లు మూసివేశారు. సరైన సమాచారం ఇచ్చేవారు కూడా లేరు" అని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉందని, తమ బృందంలో ఉన్న వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. "మాలో కొందరికి డయాబెటిస్, అధిక రక్తపోటు ఉన్నాయి. ఇక్కడ వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వడం లేదు.

### అంగన్‌వాడీ సమస్యలపై
# అసెంబ్లీలో చర్చ



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ 14వ రోజు సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఇవాళ(గురువారం) శాసన సభలో అంగన్‌వాడీల అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా పాక్షికంగా పూర్తయిన అంగన్‌వాడీ భవనాల అంశంపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు ప్రశ్నించారు. ఈ విషయంపై తెలుగుదేశం రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడారు. అంగన్‌వాడీల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలని తాము వెళ్లినప్పుడు ఆయా కేంద్రాల్లో ఐదుగురు మాత్రమే ఉంటున్నారని చెప్పుకొచ్చారు. ఇది భారీ కార్యక్రమమని.. చాలా మందికి ఉపాధి కల్పించిందని తెలిపారు. కడియం మండలంలో స్థానిక సంస్థల నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేశారని గోరంట్ల బుచ్చయ్య ప్రస్తావించారు. అలాగే ఇదే అంశంపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడారు. ఏపీ వ్యాప్తంగా 55,746 అంగన్‌వాడీ కేంద్రాల్లో 21,756 సొంత భవనాలు, 10,556 కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయని వివరించారు. 23,424 కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయని... వాటిని అమలు చేస్తున్నామని, వాటిలో కొన్ని భవనాలు నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. 2922 భవనాల నిర్మాణాలను అమలు చేశామని.. వీటిలో 948 అంగన్‌వాడీ భవనాలు పూర్తి దశలో ఉన్నాయని.. వాటికోసం రూ.4కోట్లు విడుదల అయ్యాయని చెప్పుకొచ్చారు. రూ.193 కోట్లు ఉంటే అన్ని అంగన్‌వాడీ భవనాలు పూర్తిచేయగలుగుతామని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 62 సంవత్సరాలు పూర్తయితే వారికి గ్రాట్యుటీ ఇస్తామని స్పష్టం చేశారు. రాగి, జొన్నలను కూడా ఆహారంగా అందిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు అంగన్‌వాడీలకు స్టేషన్ రికగ్నిజైషన్ ఉండటంతో అందరూ సెంటర్లకు వస్తున్నారని పేర్కొన్నారు.




## అంచనాలు పెంచుతున్న 'మృత్యుంజయ్'



'మృత్యుంజయ్' .. అంటే మృత్యువును జయించినవాడు అని అర్థం. టైటిల్ పరంగా చూసుకుంటే ఇది చాలా కుతూహలాన్ని రేకెత్తించేదే అని చెప్పాలి. అలాంటి టైటిల్ తో ఇప్పుడు ప్రేక్షకులను పలకరించడానికి శ్రీవిష్ణు రెడీ అవుతున్నాడు. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, రేపు థియేటర్లకు రానుంది. సందీప్ గుణ్ణం - వినయ్ చిలకపాటి నిర్మించిన ఈ సినిమాలో, శ్రీవిష్ణుకి జోడీగా రెబా మోనికా జాన్ కనిపించనుంది. శ్రీ విష్ణు - రెబా మోనికా జాన్ కలిసి చేసిన రెండో సినిమా ఇది. గతంలో వీరి కాంబినేషన్ లో వచ్చిన 'సామజవరగమన' సూపర్ హిట్ గా నిలిచింది. ఆ తరువాత రెబా మోనికా జాన్ ఒకటి రెండు తెలుగు సినిమాలలో అతిథి పాత్రలలో మెరిసింది అంతే. తమిళ .. మలయాళ సినిమాలతో మాత్రం బిజీగానే ఉంది. ఇక ఈ మధ్యనే కన్నడ సినిమాలను లైన్లో పెడుతోంది. ఈ నేపథ్యంలో ఆమె శ్రీవిష్ణుతో కలిసి ఈ సినిమా చేసింది.

## అంతర్జాతీయ ఉద్రిక్తతలున్నా.. లాభాల్లో స్టాక్ మార్కెట్లు




మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల సమయానికి సెన్సెక్స్ 246 పాయింట్ల లాభంతో 79,362 వద్ద, నిఫ్టీ 84 పాయింట్లు పెరిగి 24,565 వద్ద ట్రేడవుతున్నాయి. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఘర్షణల భయాలతో నిన్న సెషన్‌లో సూచీలు నష్టాలతో ముగిసిన విషయం తెలిసిందే. ఉదయం ట్రేడింగ్‌లో ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల సూచీలు మినహా మిగతావన్నీ లాభాల్లో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా నిఫ్టీ మెటల్ 1.23 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ 1.43 శాతం మేర లాభపడి మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 1 శాతానికి పైగా లాభాలతో రాణిస్తున్నాయి.

### కోలీవుడ్‌పై శ్రీలీల ఫోకస్!

టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల, తన కెరీర్‌ను జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటోంది. కేవలం ఐటమ్ సాంగ్స్‌కే పరిమితం కాకుండా, స్క్రిప్ట్, పాత్ర ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో 'ఆషికీ 3'లో నటిస్తోంది. అలాగే, కోలీవుడ్ స్టార్ ధనుష్ 55వ చిత్రంలోనూ హీరోయిన్‌గా ఎంపికైంది. టాలీవుడ్‌లో 'ఉస్తాద్ భగత్ సింగ్' త్వరలో విడుదల కానుంది. ఈ తెలివైన నిర్ణయాలతో శ్రీలీల దక్షిణాది నుంచి బాలీవుడ్ వరకు తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది. రానున్న రోజులు ఆమె కెరీర్‌కు కీలకం కానున్నాయి.

### ఈ మామిడిపండ్లు అత్యంత అరుదైనవి..
## ఒక్క పండు ధర రూ.1500



ఒక్కో మామిడిపండు ధర సుమారు రూ.1500 అంతకంటే ఎక్కువగా ఉంటుంది. ఈ పండును రక్షించడానికి పత్తితో మృదువుగా చుట్టి ఉంచుతారు. ప్రతి సంవత్సరం చాలా తక్కువ పరిమాణంలో మాత్రమే కోత జరుగుతుంది కనుక దీని అరుదుతనం మరింత పెరుగుతుంది. అలాగే కోహితూర్ మామిడిపండును బెంగాల్ లో అత్యంత ప్రతిష్ఠాత్మక మామిడిపండ్లల్లో ఒకటిగా భావిస్తారు. ఈ పండు Siraj-ud-Daulah కాలానికి చెందినది అని చరిత్ర చెబుతోంది. ఆ కాలంలో ఉండే అత్యుత్తమ మామిడి మొక్కలతో అరుదైన కాలోపహార్ రకంతో కలిపి గ్రాఫ్టింగ్ ద్వారా ఈ రకాన్ని అభివృద్ధి చేసినట్టు సమాచారం. అదే విధంగా ఈ కోహితూర్ మామిడి మొక్కలు కొద్ది సంఖ్యలో మాత్రమే ఉన్నాయి. కొన్ని సంవత్సరాల్లో వీటి దిగుబడి 150 పండ్లు మాత్రమే అని సమాచారం.